



జాతీయరహదారిని అనుసరించి నిరుపయోగంగా ఉన్న భవనాలు



అసంపూర్తిగా నిలిచిన కూరగాయల మార్కెట్ పనులు

# అసంపూర్తి.. నిరుపయోగం



ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి భవనం

**జడ్చర్ల:** నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలు తదితర నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఈ నిర్మాణాలు నిలిచాయి. ఆయా భవనాల పరిస్థితి ఇలా..

➩ 2006లో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రూ.10 లక్షలు వెచ్చించి మహిళా సమాఖ్య భవనాన్ని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పిల్లర్లు, స్లాబు వరకు నిర్మాణం పూర్తి చేశారు. అనంతరం నిధుల లేమీతో వదిలేశారు.

➩ సిగ్నల్‌గడ్డ వద్ద దూర దృష్టి లేకుండా దశాబ్దం కిందట మత్స్య కార్మికుల ఉపాధి నిమిత్తం రూ.5లక్షలు వెచ్చించి ప్రధాన రహదారిని అనుసరించి షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ప్రస్తుతం దీనిని రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చి వేశారు. ఈ పక్కనే రూ.లక్షలు వెచ్చించి ఎస్సీ బాలికల వసతి గృహాన్ని నిర్మించారు. దీనిని కూడా విస్తరణ పనుల నిమిత్తం కూల్చి వేశారు. దీని పక్కనే జెడ్పీ బాలుర పాఠశాల భవనాల పరిస్థితి అలాగే మారింది.

➩ 15 ఏళ్ల కిందట పద్మావతీ కాలనీలో కూరగాయల మార్కెట్ కోసం నిర్మాణ పనులు మొదలు పెట్టి పిల్లర్ల వరకు పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. ఎప్పుడో 44వ నంబర్ జాతీయరహదారిని అనుసరించి నిర్మించిన రెండు భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి.

➩ బాదేపల్లి మార్కెట్ యార్డు సమీపంలో దాదాపు రూ. రెండు కోట్లు వెచ్చించి రైతు బజార్ నిర్మించారు. అన్ని హంగులతో దుకాణ సముదాయాన్ని సైతం నిర్మించారు. రూ. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన రైతు బజార్ నిర్మాణాలు వినియోగం లేక వృథాగా మారాయి.

➩ 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనం సైతం నిరుపయోగంగా మారింది. కల్వకుర్తి ప్రధాన రహదారిని అనుసరించి కొత్తగా వంద పడకల ఆస్పత్రి నిర్మించడంతో ప్రస్తుతం ఇది ఖాళీగా ఉంది.

➩ గాంధీ చౌరస్తాలో పశుసంవర్ధక శాఖకు చెందిన ఓ భవనంలో ఇన్నాళ్లు తహసీల్దార్ కార్యాలయం కొనసాగింది. అయితే కొత్తగా భవనం నిర్మించడంతో.. ఈ భవనం ఖాళీగా మారింది.

➩ పత్తి మార్కెట్ యార్డులో నిర్మించిన దాదాపు 20 దుకాణ సముదాయాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఆయా భవనాలను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

**అద్దె భవనాల్లో పలు కార్యాలయాలు**

ఓ వైపు రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు ఖాళీగా.. అసంపూర్తిగా మిగిలి పోతే.. మరోవైపు కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. వీటికి ప్రతి నెలా రూ.వేలల్లో అద్దె చెల్లిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ కార్యాలయం, ప్రభుత్వ గురుకుల, హాస్టల్స్ అద్దె భవనాలల్లో కొనసాగుతున్నాయి. వీటికి ప్రతి నెలా భారీగా అద్దెలు చెల్లిస్తున్నారు. ఆయా భవనాలు, అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేసి వినియోగిస్తే పలు కార్యాలయాలకు సౌకర్యంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



వృథాగా మారిన రైతు బజార్ కాంప్లెక్స్



నిరుపయోగంగా రైతు బజార్



అసంపూర్తిగా మహిళా సమాఖ్య భవనం

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కురుమూర్తి

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** దేశవ్యాప్తంగా జూలై 10న కార్మికుల (కోరికల దినం) డిమాండ్స్‌డేను జయప్రదం చేయాలని సీఐటీయూ కార్యదర్శి కురుమూర్తి అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్మికులందరికీ సమాన వేతనం 26,000 అమలు పరచాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచడంతోపాటు పర్మినెంట్ చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు దమాయపల్లి వెంకటయ్య, యాదయ్య, రాములు, గోపాల్, వర్ధగాలన్న పాల్గొన్నారు.

# మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం



బెల్టులు పొందిన విద్యార్థులు

**మహబూబ్‌నగర్ క్రీడలు:** కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని సీపీఐ పట్టణ ఉప కార్యదర్శి కోటకదిర నర్సింలు అన్నారు. జిల్లా కేంద్రంలోని మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్, సీనియర్ మాస్టర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సింలు మాట్లాడుతూ విద్యార్థులు కరాటేలో ప్రతిభచాటాలని కోరారు. కరాటే మాస్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ బెల్టు గ్రేడింగ్ పరీక్షలో 15 మంది విద్యార్థులు ఆరెంజ్‌బెల్టు, 15 మంది విద్యార్థులు ఎల్లో బెల్టు, నలుగురు బ్లూబెల్టు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే బ్లాక్‌బెల్టు శివశంకర్, అక్షయ వర్షిని, నరేందర్, హరి, మహేందర్, నరేందర్‌రెడ్డి, యాదయ్య, వెంకటేశ్, బాలకృష్ణ, రాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా ఇసుక దందా..



చౌదర్‌పల్లి శివారులో ఫిల్టర్ ఇసుక తయారీ కోసం కుప్పలుగా పోసిన మట్టి



తయారు చేసిన ఫిల్టర్ ఇసుక

**దేవరకద్ర:** మండలంలో జోరుగా ఇసుక దందా సాగుతోంది. గుట్టు చప్పుడు కాకుండా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వార ఇసుకను పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. కోయిల్‌సాగర్ వాగును గుల్ల చేస్తు ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పరంగా చేపట్టే పనుల కోసం అనుమతి తీసుకుని.. అవసరానికి మించి రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పెద్దరాజమూర్, చిన్నరాజమూర్, గూరకొండ, పెద్ద గోప్లాపూర్ శివారులోని కోయిల్‌సాగర్ వాగు నుంచి నిత్యం ఈ వ్యవహారం సాగుతోంది. రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంతో దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు. అదేవిధంగా చిన్నచింతకుంట మండల పరిధిలో ఉన్న వాగు నుంచి కూడా ఇసుక తరలింపు సాగుతోంది. రెండు నెలల క్రితం వాగులో దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాలకు చెందిన ఇసుక దందా చేసే వారి మధ్య గొడవలు కూడా జరిగాయి. వెంకటాయపల్లి శివారుల్లో పెద్ద ఎత్తున మట్టిని తరలించి ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. దీని వల్ల మట్టి దిబ్బలు మాయం అవుతున్నాయి. కొన్ని చోట్ల మట్టిని తీయడం వల్ల గోతులు ఏర్పడుతున్నాయి. దేవరకద్ర మండలం నుంచి మట్టిని తరలించి చౌదర్‌పల్లి సమీపంలోని మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. దేవరకద్ర నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే దారిలో ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నా ఎవరికీ పట్టక పోవడం ఆశ్చర్యం కలిస్తోందని ప్రజలు అంటున్నారు.

## క్లుప్తంగా

### మైసమ్మ ఆలయంలో జడ్జి, ఎమ్మెల్యే పూజలు

**నవాబుపేట:** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పర్వతాపూర్ (ఫతేపూర్) మైసమ్మ ఆలయంలో జిల్లా జడ్జి సంధ్యారాణి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఆమెకు అధికారులు, పూజారులు ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆమె వెంట ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి, మాధవులు, గోపాల్, శ్రీనివాస్‌గుప్తా తదితరులున్నారు. అదేవిధంగా పేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి సైతం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు.

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**కోయిల్‌కొండ:** మండల కేంద్రంలోని మైసమ్మ గేట్ వద్ద ఆలయ పునఃనిర్మాణానికి గ్రామస్తులు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. గత సంవత్సరం మైసమ్మ దేవాలయాన్ని ఇసుకటిప్పర్ ఢీ కొన్న నేపథ్యంలో నూతనంగా ఆలయం నిర్మించేందుకు దాతల సహకారంతో చర్యలు చేపట్టారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**అడ్డాకుల:** మండలంలోని కందూర్‌కి చెందిన జక్కుల తిరుపతయ్య మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయాన్ని బాధితకుటుంబానికి అందజేశారు. గొల్ల బుడ్డన్న, నాగన్న, వెంకటయ్య, రాములు, బాలయ్య, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

**పాలమూరు:** వర్షాకాలం మొదలైన క్రమంలో సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనరల్ మెడిసిన్ వైద్యుడు స్వరూప్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న క్లినిక్‌లో ఆదివారం పేషెంట్లకు ఉచితంగా పరీక్షలు, ఓపీ నిర్వహించారు. ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రంగా పెట్టుకోవడంతో పాటు వేడి ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయవర్ధన్‌రాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### బ్రోచర్ల ఆవిష్కరణ

**మహబూబ్‌నగర్ క్రీడలు:** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో వచ్చేనెల 18న జరిగే 34వ నేషనల్ లెవల్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ బ్రోచర్లను ఆదివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ టోర్నీలో ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆర్గనైజర్లు ఎండి.నవీద్ బియబాని, టి.నాగేశ్వర్‌రావు, మాస్టర్లు సయ్యద్ అక్రముల్ల హుస్సేని, ఉమర్ బిన్ తయ్యబ్, జి.కృష్ణయ్య, జహంగీర్‌పాష , కనకం యాదవ్, సాలంబిన్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల్లో సత్తా చాటుదాం



రెడ్డిపల్లిలో మొక్కలు నాటిన మారుతి కిరణ్ తదితరులు

**గండేడ్:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ పేర్కొన్నారు. ఆదివారం రెడ్డిపల్లిలో కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. కప్లాపూర్, లింగాయిపల్లి, జక్లపల్లిలో కార్యకర్తలతో మాట్లాడారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ప్రధాని పిలుపు మేరకు అమ్మ పేరుతో ప్రతి కార్యకర్త ఒక్క మొక్క నాటాలన్నారు. మండలాధ్యక్షుడు ప్రభునాయక్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, మోహన్ గౌడ్, ఎస్సీ మోర్చా నాయకుడు నర్సయ్య, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రఘు, గొడుగు రాములు, హరీష్ గౌడ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రంగనాయకస్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేద్దాం



మాట్లాడుతున్న జగ్‌పాల్‌రెడ్డి

**జడ్చర్ల:** బాదేపల్లి పెద్ద గుట్టపై శ్రీ రంగనాయక స్వామి ఆలయం అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని వీహెచ్‌పీ నాయకులు జగ్‌పాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పాతబజార్ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మొదటగా శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పట్టణంలో కులాలకతీతంగా అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి శ్రావణమాసం ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించాలని తీర్మానించారు. తాత్కాలికంగా ఆలయ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ రేణుక, రంజిత్‌బాబు, శ్రీనివాస్‌గౌడ్, ఫణిరాజ్‌గౌడ్, సాహితి, శివకుమార్, నర్సిములు, నర్సింహరావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

**కోనేరు పూడ్చివేతకు నిరసనగా నేడు బంద్**

పెద్ద గుట్టపై కోనేరు పూడ్చివేతను నిరసిస్తూ సోమవారం పట్టణ బంద్, ధర్నా తదితర నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, విద్యాసంస్థలు తదితరులు బంద్ పాటించి విజయవంతం చేయాలని కోరారు.

# అడవులే మానవాళికి జీవనాధారం

**నవాబుపేట:** అడవులే మానవాళికి జీవనాధారమని.. వాటి వల్లనే అన్ని కాలాలు సమతుల్యంగా కొనసాగుతాయని వ్యవసాయ అధికారులు కృష్ణకిషోర్, తేజస్వీని అన్నారు. రుద్రారం రైతువేదిక ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటారు. అడవులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ సందర్భంగా పలు మొక్కల వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో రైతుబంధు మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణగౌడ్, భూపాల్‌రెడ్డి, రవి, వెంకటేష్, యాదయ్య తదితరులు ఉన్నారు.



మొక్కలు నాటుతున్న రైతులు, అధికారులు

# ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు



అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

**మహబూబ్‌నగర్ రూరల్:** ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని.. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏనుగొండలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మల్లెపోగు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని అన్నారు. రెడ్‌క్రాస్ అనాథ ఆశ్రమంలోని పండ్లు పంపిణీ చేశారు. అనుపటి రామస్వామి, యాదయ్య, అనుపటి వెంకటయ్య, శివరాములు, భాస్కర్, రాజు, కొత్త మాధవ్, కిరణ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ అనేక ఉద్యమాలను చేపడుతుందని ఎంఈఎఫ్ జాతీయ నాయకుడ పోలే బాలయ్య అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణమాదిగ జన్మదినాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీరాములు, జె.బాలరాజు, వెంకటస్వామి, గాలి యాదయ్య, సువార్తమ్మ, కావలి కృష్ణయ్య, మంగనూర్ వెంకటేష్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

**మిడ్జిల్:** మండల కేంద్రంలో అధ్యక్షుడు సురేష్ జెండాను ఆవిష్కరించారు. బాలయ్య, బాలు, దేవయ్య,జంగయ్య ,సురేష్ పాల్గొన్నారు.

**అడ్డాకుల:** మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేవదానం , హనుమంతు, ప్రసాద్, దానేలు, శ్రీకాంత్, చంద్రం , రామన్న, శేఖర్, సులేమాన్, బాలరాజు ఉన్నారు.

# సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తాం

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక 3, 10వ వార్డుల్లో ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. మూడో వార్డు పరిధిలోని పోచమ్మ దేవాలయం వద్ద మండప నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎనుగొండ, విఘ్నేశ్వరకాలనీలలో నెలకొన్న సమస్యలను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. కాగా, ఆయా కాలనీలలో రోడ్లతో పాటు డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని దీంతో మురుగు ఎక్కడికక్కడే ఓపెన్ ప్లాట్లలోని గుంతల్లో నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని వారు ఫిర్యాదు చేశారు. దోమల బెడద తీవ్రంగా ఉందని నివారణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం 28వ వార్డు పరిధిలోని బండ్లగేరిలో మేదరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్ రామాంజనేయులు, మాజీ కౌన్సిలర్ శివశంకర్, స్థానికులు రాజు, రామస్వామి, కిరణ్, రమేష్, శ్రీను, వెంకటయ్య, శివరాజ్, వెంకటేష్, సత్యం, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### పైపులైన్ పనుల పరిశీలన



**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక మూడో వార్డు పరిధిలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి ఎదురుగా వెలసిన కాలనీకి మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీటి కోసం గతంలోనే పైపులైన్ వేసినా సరిగా సరఫరా కాకపోవడంతో స్థానికులు ఇటీవల మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రస్తుతం మెయిన్ రోడ్డు నుంచి పెద్ద పైపులైన్‌తో పాటు గేట్ వాల్వ్ ఏర్పాటు చే స్తున్నారు. ఈ పనులను ఆదివారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

### ‘అరాచకాన్ని ప్రజలు మరిచిపోలేదు’



**స్టేషన్ మహబూబ్‌నగర్:** మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభివృద్ధి పేరిట నియోజకవర్గంలో చేసిన అవినీతి, అరాచకాన్ని ఇంకా ప్రజలు మరిచిపోలేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేపై మాజీ మంత్రి చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. డబ్బులు తీసుకొని డబుల్‌బెడ్‌రూంలు అమ్ముకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని దుయ్యబట్టారు. ట్యాంక్‌బండ్‌లో అభివృద్ధి పేరుమీద రూ. కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ వారి ఫ్లెక్సీలు తీయడం తమకు అవసరం లేదన్నారు. గత పదేళ్ల పాలనలో ప్రతిపక్షాల ఫ్లెక్సీలు లేకుండా చేసింది బీఆర్ఎస్సేనని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీతో బేరం కుదుర్చుకొని నియోజకవర్గంలో కేవలం 13వేల ఓట్లకు పరిమితమయ్యారని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. సమావేశంలో డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్‌ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్‌యాదవ్, అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించాలి

**మహబూబ్‌నగర్ రూరల్:** రాష్ట్రంలోని ఎరుకల సంక్షేమం కోసం వచ్చే బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించి, ఏకలవ్య (ఎరుకల) కార్పొరేషన్ చైర్మన్‌ను ప్రకటించాలని నాయకులు అన్నారు. తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి విషయంపై విన్నవించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొన్నకల్ కృష్ణయ్య మాట్లాడుతూ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని వివరించామన్నారు. ఈనెల 17న జిల్లా కేంద్రంలో నిర్వహించే ఏకలవ్యుడి జయంతి వేడుకలకు ఎమ్మెల్యేను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు, ఉపాధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర కోశాధికారి కృష్ణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**మహబూబ్‌నగర్ రూరల్:** మన్యంకొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల (2007–08లో పదోతరగతి) పూర్వ విద్యార్థులు ఆదివారం.. ఆ బడి ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల ఉన్నతి కోసం పాటుపడతామని చెప్పారు. ఆనాటి గురువులు వెంకటయ్య, రాములు, రేణుకాబాయి, చల్వాచారి, పాఠశాల హెచ్ఎం రవీందర్‌గౌడ్, పూర్వ విద్యార్థులు వెంకట్‌నాయక్, నరేష్‌కుమార్, తులసీరామ్, సాహజ బేగం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నడకతో ఆరోగ్యానికి మేలు



వాకథాన్ ప్రారంభిస్తున్న సీఐ ఆదిరెడ్డి తదితరులు

**జడ్చర్ల టౌన్:** పట్టణంలోని ఏగూర్ ప్రైం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం 3కే వాకథాన్ నిర్వహించారు. ఆస్పత్రి వద్ద సీఐ ఆదిరెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ నటరాజ్ కార్యక్రమం ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రధాన రోడ్డు మీదుగా కావేరమ్మపేట మినీట్యాంక్ బండ్ వరకు వాకథాన్ కొసాగింది. ఫ్లెవైక్ అసోసియేషన్ సభ్యులు, వాకర్స్, ఆస్పత్రి సిబ్బంది, ఐఎంఏ అసోసియేషన్ డాక్టర్లు, పట్టణ ప్రముఖులు వందలాదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఐ ఆదిరెడ్డి, సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ మాట్లాడారు. నడక ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. ఆస్పత్రి నిర్వాహకులు డా. అంకిత్, డా.రచిత తదితరులు పాల్గొన్నారు.